మధ్యమావతి ఆది

గుఱుతెఱగిన దొంగ - కూగూగు వీడె
గుటిలోన దాగీని - కూగూగు

నెలతల దోచీని - నీళ్లాడగానె
కొలని దరిని దొంగ - కూగూగు
బలువైన ఉట్ల పా - లారగించీని
కొలది మీరిన దొంగ - కూగూగు

తావుకొన్న దొంగ - తవిలిపట్టుండిదె
గోవులలో దొంగ - కూగూగు
శ్రీ వేంకటగిరి - చెలువుడో యేమో
కోవిదుడు దొంగ - కూగూగు

అన్నమాచార్యుల పదకవితా సామ్రాజ్యంలో లేని ప్రక్రియ లేదు. దంపుళ్ల పాటలు, జాజరలు, బావామరదళ్ల పాటలు, ఉయ్యాల పాటలు, లాలిపాటలు, తుమ్మెద పదాలు, కూగూగులు, గొబ్బిళ్ళు ఎన్నెన్నో నభూతభవిష్యంగా వెలయించిన మహాప్రయోక్త ఆయన. చిన్నపిల్లలను మెడమీద ఎక్కించుకొని పాడే పాట కూగూగు. పెదతిరుమలయ్యనో, చిన తిరుమలయ్యనో చిరుత ప్రాయంలో కూగూగు ఎక్కించుకొని, తిరుమల కొండ మెట్లె క్కుతూ ఈ సంకీర్తన అన్నమాచార్యులు పాడి ఉండవచ్చునని స్వానుభవం వల్ల నాక్కలి గిన అనుమానం. అన్యథా సాక్షాత్ శ్రీవేంకటేశుడే పసిబాలుని రూపంలో సాక్షాత్కరిస్తే ఆయనను భుజమెక్కించుకొని ఈ సంకీర్తన గానం చేసి ఉంటారు అన్నమాచార్యులు.

కూగూగు యెక్కిన ఈ కుంకదొంగ గుఱుతు ఎరిగినవాడట (శంఖ చక్ర సంజ్ఞల ధ్వని) పరమ యోగులకు లక్ష్యమై వారికి సైతం లక్ష్యసాధనలో చేజిక్కక అందందే దా గుడుమూతలాడే దొంగ ఈ కూగూగు యెక్కినవాడే.

గొల్లభామలు జలకాలాడుతుండగా వారి బట్టలు ఎత్తుకవెళ్లిన దొంగ కూగూగు. వ్రేపల్లె ఎత్తైన ఉట్లలో పాలన్నీ ఆరగించే పట్టవంశంకాని దొంగకూగూగు వీడే సుమా (పట్టవశం కానిది పరమమునులకు సైతం అని పల్లవితో అన్వయం).

ముద్దుల పాపడని చంక నెత్తుకొని గొల్లెతలు చల్లపెరుగులమ్మబోగా వారి చనుకట్లు తడివినతుంట సుమా ఈ దొంగ కూగూగు. ఒక్క యిల్లు కూడా విడవక ఇందరు గొల్లయిల్లాండ్ర పాలిండ్లు (పాలు భద్రపరచే గదులు) కొల్లగొట్టిన దొంగ కూగూగు వీడే.

ఈ దొంగ యిప్పుడు తిరుమలపై తావుకొన్నవాడు. (స్థిర) నివాసం ఏర్పరచుకున్నాడు. (నివేశన స్థలం అద్దెకు పుచ్చుకొన్నవాడు వరాహస్వాముల వద్ద) గోవులలో దాగిన (బ్రహ్మను సైతం మాయజేసి మారాకు హత్తించిన) ఈ దొంగని తరిమి పట్టుకోండి. (భక్తులు, మునులూ సాధకులూ అందరూ) శ్రీ వేంకటగిరి వరుడుగదా ఇతడు కడు నేర్పరి.(చిక్కకుండా తప్పించుకొనేవాడు.)బ్రహ్మాదులకు సైతం అలవికానివాడు ఈ దొంగ అంటూ అన్నమాచార్యులు ఈ కూగూగు పాటలో పరమేశ్వరుడైన హరి అనుపగతత్వాన్ని, సర్వాపగమత్వాన్ని ఉపగమించి అధిగమించారు.